క్లుప్తంగా

వ్యక్తి రిమాండ్

చందంపేట : మండలంలోని పెద్దమునిగల్ గ్రామానికి చెందిన కేతావత్ చెన్న తన వ్యవసాయ పొలాన్ని అడవి పందుల నుంచి రక్షించుకునేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగలడంతో ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ ప్రాంతానికి చెందిన వెంకటేష్(42) మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి కేతావత్ చెన్నాను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

'పూల రవీందర్‌ను గెలిపించండి'

మిర్యాలగూడ టౌన్ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్‌ను గెలిపించేందుకు బీసీలందరూ ఏకం కావాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు గాదగోని మహేష్ గౌడ్ కోరారు. మంగళవారం పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంపులో గల మహాత్మాజ్యోతిరావ్‌పూలే బీసీ భవనంలో నిర్వహించిన సమావేశంలో వారు మా ట్లాడారు. ఈ సమావేశంలో ఆ సంఘం నా నాయకులు దాసరాజు జయరాజు, సురేష్, రాజు, వెంకన్న, గంగాధర్, ఉపేందర్, రమేష్, అరవింద్, రవీందర్‌నాయక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చిట్టీల వ్యాపారి కుచ్చు టోపీ

- 84 మందికి ఐపీ నోటీసులు

గుర్రంపోడు : మండలకేంద్రానికి చెందిన చిట్టీల వ్యాపారి కోట్లాది రూపాయల అప్పులు తీసుకుని 84మందికి ఐపీ నోటీసులు పంపడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. మండల కేంద్రంలో కిరాణం వ్యాపారం నిర్వహిస్తూ చిట్టీల వ్యాపారం కూడా చేశాడు. పలువురి వద్ద అప్పుగా కూడ తీసుకుని గత కొంత కాలంగా చెల్లించడం లేదు. మంగళవారం గంగసాని అంజయ్య, సతీష్‌ల పేరున పోస్టు ద్వారా అందిన నోటీసుల్లో మార్చి 17న కోర్టుకు హాజరుకావాలని ఉంది. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు.

టాలెంట్ టెస్ట్ కరపత్రం ఆవిష్కరణ

హాలియా : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మార్చి 2న నిర్వహించే జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌ను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోరే రమేష్ పిలుపు నిచ్చారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అనుముల ఎంఈఓ గుండా కృష్ణమూర్తి ఆ టాలెంట్ టెస్ట్ కరపత్రాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి టాలెంట్ టెస్ట్‌లు ఎంతో దోహదపడుతుందన్నారు. పూర్తి వివరాల కోసం 9553801351, 9010679628 నంబర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరాంరెడ్డి, అంజయ్య, నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయండి

వేములపల్లి : ఉపాధ్యాయులు బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీజేపీ మండల నాయకుడు పెదమాం భరత్ కోరారు. మంగళవారం మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధ్యాయులను కలిసి ఆయన ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చిర్ర సాంబమూర్తి, కర్ర దామోదర్‌రెడ్డి, జవ్వాజి సత్యనారాయణ, పెదమాం ప్రసాద్, శ్రీను, నాగేందర్ పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థ బలోపేతానికి కృషి

మిర్యాలగూడ టౌన్ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా తనను గెలిపిస్తే విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తానని అభ్యర్థి పన్నాల గోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం దామరచర్ల మండలంలో ఉపాధ్యాయులను కలిసి ఓటును అభ్యర్థించి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎ ఇతరులు ఎవరైన గెలిచినా అధికార పార్టీ కనుసనాల్లోనే ఉంటాయన్నారు. ఈ సమావేశంలో టీజెఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు క్రాంతికుమార్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని గ్రామపంచాయతీ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ భైరం దయానంద్ అన్నారు. మంగళవారం దామరచర్ల మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ సిబ్బందితో కలిసి ఆయన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వాలు మారినా గ్రామపంచాయతీ కార్మికుల బతుకులు మారడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పాతులోతు విజయ్‌కుమార్, గుండు వెంకటేశ్వర్లు, అక్కినపల్లి సైదులు, ముదుసు సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

కరాటే శిక్షణ..బాలికలకు ఆత్మరక్షణ

- మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థినులకు శిక్షణ
- మూడు నెలల పాటు తర్ఫీదు
- ఆరోగ్యంతోపాటు ఆత్మస్థైర్యం పెంపు


పిట్టలగూడెంలో కరాటే నేర్చుకుంటున్న విద్యార్థినులు

గుర్రంపోడు : బాలికలపై దాడులు అరికట్టేందుకు స్వీయరక్షణ పద్ధతులు ఎంతో ఉపయోగపడతాయి. ఈ నేపథ్యంలో విద్యాశాఖ ఉన్నత పాఠశాల బాలికలకు ఆత్మరక్షణ విద్యను అందిస్తుంది. బాలికలపై దాడులు, తమకు తాము రక్షించుకునేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ సెల్ఫ్ డిఫెన్స్ ట్రెనింగ్ నల్లగొండ జిల్లా శాఖ, సోర్ట్స్ కారటే అసోసియేషన్లు జిల్లా విద్యాశాఖ అధికారి నుంచి ఉన్నత పాఠశాలల బాలికలకు కరాటే నేర్పించేందుకు అనుమతి పొందింది. మండలంలోని గుర్రంపోడు, పిట్టలగూడెం, కొప్పోలు, పోచంపల్లి, నడికూడ, తేనపల్లి, చేపూరు, కేజీబీవీ పాఠశాలల్లో బాలికలకు నవంబర్ నుంచి ఫిబ్రవరి నెల వరకు రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ కరాటే శిక్షణ తరగతులు విజయవంతంగా సాగుతున్నాయి. గ్రామీణ విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టి, ఆత్మరక్షణకు ఉపయోగపడేందుకు కరాటే శిక్షణను విద్యాశాఖ నిర్వహిస్తుంది. ఆపద సమయాల్లో ఆత్మరక్షణ మెలకువలు, ఏకాగ్రత, పట్టుదల పెరిగేలా తీర్చిదిద్దుతున్నారు. శిక్షణకుగాను ట్రైనర్‌కు ఒక్కో పాఠశాలకు శిక్షణాకాలం మొత్తానికి కలిపి పదిహేను వేల రూపాయలు అందిస్తున్నారు.

కరాటే శిక్షణపై బాలికలకు అవగాహన

కరాటే శిక్షణ అవసరాన్ని బాలికలకు వివరించి వారికి పాఠశాల్లో శిక్షణను అందిస్తున్నారు. చదువుతోపాటు ఆటలు లాగానే కరాటే కూడ నేర్చుకోవాలని చెబుతుండటంతో బాలికలకు ఉత్సాహంగా కరాటే నేర్చుకుంటున్నారు. కరాటే వల్ల వారిలో ఆత్మస్థైర్యంతో పాటు ఆరోగ్యం కూడా లభిస్తుందని వివరిస్తున్నారు. ఉన్నత పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయుని పర్యవేక్షణలో మాస్టర్ ట్రైనర్ చే శిక్షణ జరుగుతుంది. జిల్లాలోని 262 ఉన్నత పాఠశాలల్లో కరాటే శిక్షణ అందించబడుతుంది.

ఉత్సాహంగా నేర్చుకుంటున్నాం



విద్యార్థినుల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు పాఠశాలల్లో కరాటే శిక్షణ ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. శిక్షణలో ఉత్సాహంగా పాల్గొంటున్నాం. కరాటే నేర్చుకోవడంతో ఆత్మస్థైర్యం కలుగుతోంది. ఆపద సంభవించినప్పుడు ధైర్యంగా ఎదుర్కోగలం

– పోలె బ్లెస్సీ, విద్యార్థిని పిట్లగూడెం, జెడ్పీహెచ్ఎస్

ఆత్మస్థైర్యం పెరుగుతుంది



విద్యార్థినులకు కరాటే నేర్పించడంతో ఆరోగ్యంతోపాటు ఆత్మస్థైర్యం పెరుగుతుంది. కరాటేను విద్యార్థినులు ఎంతో శ్రద్ధగా నేర్చుకుంటున్నారు. ఎవరైనా దాడులు చేస్తే ఎలా స్పందించాలి. ఎలా త్రిప్పికొట్టాలో తెలుస్తుంది.

– అనురాధ, కరాటే ట్రైనర్

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : స్టార్ ఆస్పత్రి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో లయన్స్ క్లబ్ ఆఫ్ మిర్యాలగూడ, మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్, స్టార్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. కార్పొరేట్ ఆస్పత్రి మన వద్దకే వచ్చి కేన్సర్, మెదడు, గుండె సంబంధిత వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించి వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య పరీక్షల అనంతరం రోగులకు ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, మిర్యాలగూడ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, కంచర్ల అనంతరెడ్డి, వైద్యులు నవీన్ కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, అనిత, ప్రవీణ్, రామకృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

మిర్యాలగూడ : వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ సందర్భంగా పట్టణంలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు సెక్టోరియల్ అధికారి, తహసీల్దార్ హరిబాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బకల్‌వాడి హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాన్ని సీఐ నాగార్జునతో కలిసి తహసీల్దార్ హరిబాబు సందర్శించి ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కెమెరా నిఘాతో పోలింగ్ జరగనుందని ఆయన తెలిపారు. బాలికల ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో 355మంది, బకల్‌వాడీ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో 456 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారన్నారు. పోలింగ్ ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒకరు మైక్రో అబ్జర్వర్‌తో పాటు ఇద్దరు అధికారులు, ఇద్దరు సిబ్బంది ఉంటారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తుతోపాటు 144 సెక్షన్ అములో ఉంటుందన్నారు.

ఎన్నికల్లో నిజాయితీపరులకు ఓటెయ్యండి

మిర్యాలగూడ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిజాయితీపరులైన అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని తాప్రా జిల్లా అధ్యక్షుడు నూకల జగదీశ్చంద్ర అన్నారు. మంగళవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ ఈ సమస్యలన్నింటిని శాసనమండలిలో ప్రశ్నించే నర్సిరెడ్డికి ఉపాధ్యాయులు ఓటు వేసి తిరిగి శాసనమండలికి పంపించాలని కోరారు. నిజాయితీ పరుడు, అంకితభావం కలిగిన యూటీఎఫ్ అభ్యర్థి నర్సిరెడ్డిని ఎన్నుకోవాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పందిరి శ్యాంసుందర్, వాడపల్లి రమేష్, గర్దాసు సత్యనారాయణ, పులి కృష్ణమూర్తి, లెంకల మాధవరెడ్డి, పాషా, పాదూరి రమణరెడ్డి, సత్యనారాయణరావు పాల్గొన్నారు.

నాయకునితండా వాసికి డాక్టరేట్


భాను

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని నాయకునితండాకు చెందిన మేరావత్ స్వామి–జీజా కుమారుడు మేరావత్ భానుకు మంగళవారం డాక్టరేట్ లభించింది. ఈయన ప్రస్తుతం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈయన సింథసిస్ క్యారెక్టరైజేషన్ మాగ్నటిక్ అండ్ ఎలక్ట్రికల్ ప్రాపర్టీస్ ఆఫ్ లాంథనమ్ డోప్డ్ కోబాల్ట్, ఎర్బియం డోప్డ్ మెగ్నీషియం కాఫర్, హోల్మియం డోప్డ్ మెగ్నీషియం కాపర్ నానో ఫెర్రిటైస్‌లో టెంపరేచర్ సిట్రేట్ సోల్–జెల్ ఆటో కంబుషన్ మెథడ్ అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ పట్టా లభించినట్లు పేర్కొన్నారు. తనకు సహకరించిన డాక్టర్ జి.వినోద్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.బాలునాయక్, ప్రొఫెసర్ లక్ష్మణ్‌నాయక్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

రైతులకు 'యూరియా' తిప్పలు



సింగిల్ విండో కార్యాలయం ఎదుట బారులుదీరిన రైతులు

హాలియా : ఎరువుల కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. యాసంగి వరి పంటలు చిరు పొట్ట దశకు చేరడంతో కర్షకులు యూరియా కోసం మండలంలోని కొత్తపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయానికి పరుగులు తీస్తున్నారు. అనుముల మండలంలోని 21 గ్రామపంచాయతీలకుగాను కొత్తపల్లి వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ఒక్కటే ఉంది. సోమవారం రాత్రి కొత్తపల్లి వ్యవసాయ సహకార సంఘం కార్యాలయానికి 75 టన్నుల యూరియా (1665 బస్తాలు) రావడంతో మంగళవారం మండలంలోని మధారిగూడెం, ఇబ్రహీంపేట, కొత్తపల్లి, పంగవానికుంట తదితర గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో రైతులు కార్యాలయం వద్ద వచ్చి బయోమెట్రిక్ టోకన్ల కోసం బారులుదీరారు. ముందుగా వచ్చిన రైతులు ఒక్కరికి నాలుగు బస్తాల చొప్పున యూరియా బస్తాలు దొరకగా..వెనుక వచ్చిన రైతులకు లభించక నిరాశతో వెనుదిరిగారు. పంటలకు సకాలంలో ఎరువులు అందించకుంటే దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందని రైతులు వాపోతున్నారు. ఈ విషయమై ఏఓ సరిత స్పందిస్తూ గత రెండు, మూడు రోజులుగా యూరియా లేదని, సోమవారం రాత్రి 75టన్నుల యూరియా రావడంతో రద్దీ నెలకొందన్నారు. రైతులకు అవసరం మేరకు యూ రియా తెప్పించామని కొరత లేదన్నారు. అధిక ఎరువుల వినియోగానికి అడ్డుకట్ట వేసేందుకు బయోమెట్రిక్ విధానం అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి ఇంగ్లిష్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్

మిర్యాలగూడ : రాష్ట్ర స్థాయి ఇంగ్లిష్ ఒలింపియాడ్‌లో మిర్యాలగూడ పట్టణంలోని కాకతీయ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు ఆ పాఠశాల డైరెక్టర్ చీదళ్ల వెంకట్ అన్నారు. మంగళవారం ఆయన పాఠశాలలో మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి ఇంగ్లిష్ ఒలింపియాడ్‌లో పి. తన్సి రాష్ట్ర స్థాయి నాలుగో ర్యాంకు, వై.వేదిక్ రాష్ట్ర స్థాయి 5వ ర్యాంక్, ఆర్.జ్యోతేష్ గురుసాత్విక్ జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు, జె.యశ్వంత్, ఎల్.ఇశాంత్, ఉదయ్‌కుమార్, తన్సిశ్రీ, వివేకానందర్, మణిచందన్, అంజలి, సాయి తులసీలు డిస్ట్రిక్ కన్సోలేషన్ ర్యాంక్‌లు సాధించినట్లు తెలిపారు. ఇటువంటి పరీక్షల వల్ల విద్యార్థులకు లాంగ్వేజీల్లో మంచి పట్టు సాధించడం జరుగుతుందని తద్వారా జాతీయ స్థాయిలో ఉండే పరీక్షల్లో మంచి మార్కులు సాధించి జాతీయ, అంతర్జాతీయ యూనివర్సిటీల్లో సీటు సాధించడానికి ఈ ఒలంపియాడ్స్ ఎంతో తోడ్పడుతుందన్నారు. ఉత్తమ ప్రతిభ చాటిని విద్యార్థులను పాఠశాల చైర్మన్ గుండా హరినారాయణ, ప్రిన్సిపాల్ సతీష్‌లు అభినందించారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

నల్లగొండ: విద్యార్థులు కష్టపడి చదవాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ సుధారాణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యకు మాత్రమే సమాజాన్ని మార్చే శక్తి ఉందన్నారు. విద్యార్థినులు మనోధైర్యం కోల్పోరాదన్నారు. చదువునే నమ్ముకుని పరీక్షలు మంచిగా రాసి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డీఎస్పీ శివరాంరెడ్డి, మహిళా పీఎస్ సీఐ కరుణాకర్, గోనారెడ్డి, నర్సిరెడ్డి, దస్రూనాయక్, వెంకట్‌రెడ్డి, శిల్ప, అరుణ, కవిత, తస్లీమ్, వెంకన్న, పాల్గొన్నారు.

నందికొండలో ఎన్‌సీడీ స్పెషల్ డ్రైవ్

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని కాలనీలలో నాన్ కమ్యూనల్ డీసీజెస్(ఎన్‌సీడీ) స్పెషల్ ప్రోగ్రాంను నిర్వహిస్తున్నట్లుగా అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్ డాక్టర్ నగేశ్ తెలిపారు. దీనిలో భాగంగా 30ఏళ్లు పైబడిన వారికి బీపీ, షుగర్ సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో మూడు, నాలుగు రోజుల పాటు తమ సిబ్బంది పరీక్షలు నిర్వహిస్తారని స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మంగళవారం హిల్‌కాలనీలో ఒకటో అంగన్‌వాడీ కేంద్రంలో 32మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కమలమ్మ, హెల్త్ అసిస్టెంట్లు గంగాబాయి, సావిత్రి, లింగయ్య, తిరుమలచారి, అంగన్‌వాడీ టీచర్ ప్రియాంక పాల్గొన్నారు.


పరీక్షల నిర్వహణకు పేర్లు నమోదు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలకు మూడు సీట్లు కేటాయించాలి

మిర్యాలగూడ టౌన్ : త్వరలో జరగనున్న ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలకు మూడు స్థానాలను కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ అన్నారు. మంగళవారం పట్టణంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు సముచిత స్థానాన్ని కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు బంటు వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లి దుర్గయ్య, శేఖర్, సుధాకర్, మహేష్, మధన్, తదితరులున్నారు.


త్రిపురారం: లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో..


అడవిదేవులపల్లి : శ్రీగౌతమి పాఠశాలలో..

పాఠశాలల్లో 'స్వపరిపాలన'

హాలియా, అడవిదేవులపల్లి, త్రిపురారం : అనుముల మండలంలోని కాశివారిగూడెం ప్రాథమిక పాఠశాలలో, అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని శ్రీగౌతమి పాఠశాలలో.. త్రిపురారం మండల కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, ప్రజా ప్రతిని ధులుగా, అధికారులుగా వ్యవహరించి పలువురిని ఆకట్టుకున్నారు.


హాలియా : కాశివారిగూడెం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

భూ నిర్వాసితులకు అండగా ప్రభుత్వం

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్


భూ నిర్వాసితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

దేవరకొండ : భూ నిర్వాసితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆయన కార్యాలయంలో చందంపేట మండలం తెల్దేవర్‌పల్లి గ్రామానికి చెందిన నక్కల గండి ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన నిర్వాసితులతో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన నిర్వాసితులకు నష్టపరిహారం అందించడమే కాకుండా వారి జీవనోపాధికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. భూ నిర్వాసితులు ఎవరూ ఆందోళన చెందొద్దని ఆయన సూచించారు. భూ నిర్వాసితులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వెంట లచ్చిరాంనాయక్, బిక్కునాయక్, కిన్నెర హరికృష్ణ, మహాలక్ష్మయ్య, భరత్, తదితరులున్నారు.

గుడితండాను సందర్శించిన జిల్లా అధికారులు


గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

కొండమల్లేపల్లి : మండల పరిధిలో గల పెండ్లిపాకల జలాశయం సామర్థ్యం పెంపు కారణంగా సమీపంలో గల గుడితండా పూర్తిగా ముంపునకు గురికానుంది. కాగా తండాలోని 403 ఇళ్లకు పునరావాసం కింద నగదు చెల్లించేందుకు గాను జిల్లా ప్రత్యేక డిప్యూటి కలెక్టర్ ఆధ్వర్యంలో ఏడాది క్రితం అధికారులు సర్వే చేశారు. ఈ క్రమంలో తండావాసులకు ముందస్తుగా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మంగళవారం మధ్యాహ్నం తండాలో సమావేశం ఏర్పాటు చేశారు. అధికారులు వచ్చిన సమయంలో తండావాసులు పొలం పనులకు వెళ్లిపోయారు. దీంతో ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఎలా వస్తారంటూ అధికారులను ప్రశ్నించారు. తీరా గంటసేపు ఎదురుచూసి అధికారులు వెనక్కి వెళ్లిపోయినట్లు సమాచారం. ఈ సందర్భంగా తండాకు చెందిన రమేష్ మాట్లాడుతూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అధికారుల తీరుతో తండావాసులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. గుడితండాలో పారదర్శకంగా సర్వే చేపట్టకపోవడంతో పలువురు నష్టపోయారని తెలిపారు. నిబంధనల మేరకు సర్వే చేపట్టాలని కోరారు. ఈ విషయమై ఎస్డీసీఆర్ఐ అశ్విని ని వివరణ కోరగా విషయాన్ని దాటవేయడంతో పాటు సమాచారం చెప్పటానికి విముఖత వ్యక్తం చేశారు. కాగా స్థానిక తహసీల్దార్ హుస్సేన్ వివరణ కోరగా వారు వచ్చినట్లు తనకు ఎలాంటి సమాచారం లేదని పేర్కొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఏఎస్పీ మౌనిక

దేవరకొండ : విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్య సాధనకు నిరంతరం కృషి చేయాలని దేవరకొండ ఏఎస్పీ మౌనిక అన్నారు. మంగళవారం దేవరకొండ మండలం పెంచికల్‌పహాడ్ వద్ద గల గిరిజన బాలికల పాఠశాల,కళాశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆమె ఆకాంక్షించారు. తమ తల్లిదండ్రుల అంచనాలను, నమ్మకాలను నిలబెడుతూ జీవితంలో ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ఆమె కోరారు. గ్రామీణ ప్రాంతాల నుండి పాఠశాలకు వచ్చే విద్యార్థులు చదువుపై ఏకాగ్రత చూపించాలని తద్వార పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. నేటి యువత భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. అనంతరం విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అజ్మీరారమేష్, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు

మిర్యాలగూడ : దామరచర్ల మండలం వాడపల్లి గ్రామంలో వెలసిన శ్రీమీనాక్షి అగస్త్యేశ్వరస్వామి, శ్రీ లక్ష్మీనరసింహాస్వామి ఆలయాల్లో శివరాత్రిని పురస్కరించుకొని ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. మంగళవారం అర్చకులు శ్రీవిఘ్నేశ్వర పూజ, దైవ పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాసన, రక్షాబంధన, దీక్షా అఖండ దీపారాధన, వాస్తుపూజ, పర్యగ్నికరణం, అంకురార్పణ, దీపారాధన, ధ్వజారోహణ, నందివాహన సేవ నిర్వహించారు. 26న మహాశివరాత్రిన ఔపాసన, బలిహరణ, రుద్రాభిషేకాలు, పేరిణి శివతాండవం నృత్య ప్రదర్శన, అన్నదానం, మిమిక్రి ప్రదర్శన, భరతనాట్య ప్రదర్శన, ఎదుర్కొలు, కల్యాణ మహోత్సవం, లింగోద్భవ అభిషేకం, 27న ఔపాసన, రుద్రహోమం, శేషవాహన సేవ, 28న ఔపాసన, లక్ష్మీగణపతి హోమం, ధ్వజారోహణ, పూర్ణాహుతి, హరె శ్రీనివాస, లక్ష్మీ తిరుపతమ్మ కోఆటం, పర్వత వాహనం, ఊరేగింపు, మార్చి 1న వసంతోత్సవం పల్లకిసేవా నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ ఛైర్మన్ కొందూటి సిద్ధయ్య, ఆలయ కమిటీ ఏవో జ్యోతిలు సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు.

కృష్ణాతీరంలో ముస్తాబైన శైవక్షేత్రాలు


హాలియా : ముస్తాబైన పేరూర్ శివాలయం


నాగార్జున సాగర్ : ముస్తాబైన ఏలేశ్వరాలయం

నాగార్జునసాగర్ : మహాశివరాత్రిని పురస్కరించుకొని సాగర్‌తీరం వెంట ఉన్న శైవక్షేత్ర ఆలయాలు ముస్తాభయ్యాయి. సాగర్ జలాశయంలో ముంపుకు గురైన గ్రామాలకు ఇలవేల్పయిన కాత్యాయిని సమేత ఏలేశ్వరమల్లిఖార్జునస్వామిని తెచ్చి,సాగర్‌తీరాన పునఃప్రతిష్టించారు. ఆలయంలో శివరాత్రిని పురస్కరించుకొని శనివారం ఉదయం ఆరు గంటల నుంచే అభిషేకాలు ప్రారంభమవుతాయని ఆలయ పూజారులు ఫవన్‌కుమార్ తెలిపారు. సాగర్‌డ్యాం దిగువన నిర్మించిన శివాళయంలో శనివారం తెల్లవారు జామునుంచే పూజలు జరుగుతాయని ఆ ఆలయ పూజారి తెలిపారు. ఇవేకాక కష్ణాతీరం వెంట వెలసిన పలు శివాళయాల్లో పూజలు జరుపడానికి ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎఐ బీసన్న మాట్లాడుతూ కృష్ణాతీరంలో భక్తులు జాగ్రత్తగా ఉండాలని గజ ఈతగాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

శివరాత్రి ఉత్సవాలకు ఆలయాలు సిద్ధం..

హాలియా : మహా శివరాత్రి ఉత్సవాలకు అనుముల మండలంలోని పలు శివాలయాలు ముస్తాబైయ్యాయి. మండలంలో పేరూర్, మారేపల్లి, యాచారం, హలియా మున్సిపాలిటీలోని శివాలయాలను రంగు రంగుల విద్యుద్దీకరణలతో అలంకరించి ఉత్సవాలకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. పండుగ పర్వదిన సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆయా ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులు అన్ని ఏర్పాటు చేశారు. పేరూర్ శివాలయంలో స్వామి వారి కల్యాణాన్ని గురువారం తెల్లవారు జామున చేయడానికి ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు.

చింతపల్లి : దున్న ఇద్దాస్ ఆరాధనోత్సవాలు: తొలి దళిత కవి దున్న ఇద్దాస్ ఆరాధనోత్సవాలకు మండలంలోని చింతపల్లి గ్రామంలోని దున్న ఇద్దాస్ దేవాలయం ముస్తాబైంది. ప్రతి యేడాది మహాశివరాత్రి సందర్భంగా దున్న ఇద్దాస్ ఆరాధనోత్సవాలను నిర్వహించటం పరిపాటిగా వస్తుంది. ఈ ఉత్సవాలకు పలు జిల్లాలనుంచి దున్న ఇద్దాస్ భక్తులు వచ్చి మొక్కులను తీర్చుకుంటారు. ఈ యేడాది ఏర్పాటు చేయనున్న కరెంట్ ప్రభ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.

డిప్యూటీ సీఎంకు స్వాగతం పలికిన ఎమ్మెల్యే


డిప్యూటీ సీఎంకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ స్వాగతం పలికారు. శ్రీశైలం ఎడమగట్టు కాలువ(ఎస్ఎల్‌బీసీ) ఇన్‌లెట్ సొరంగం పైకప్పు కూలిన ప్రమాద ఘటనా స్థలాన్ని పరిశీలించేందుకు దోమలపెంటకు మంగళవారం దేవరకొండ మీదుగా వెళ్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఆయన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే బాలునాయక్ వెంట నల్లగొండ పార్లమెంట్ కో–ఆర్డినేటర్ ఎంఏ సిరాజ్‌ఖాన్,యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు రాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.